

వినాయకం ఆరోజు నిద్ర పోకుండా చాల ఆరోచించాడు.

తను నమ్ముకున్న సైకిల్‌పార్టీ రెండు చీలికలయింది. ఏ చీలికలో చేరాలా అన్నదే అతని ఆలోచన.

ఎన్నాళ్ళనించో అతను సైకిల్ పార్టీ టిక్కెట్టుమీద ఎన్నికవుతూ, ప్రజాసేవ చేస్తున్నాడు. అలా ప్రజాసేవ చేస్తూనే, నాలుగు చేతులా యథాశక్తి సంపాదించి, రైస్‌మిల్లులా, పుగాకు కంపెనీలు, నిమ్మతోటలూ స్వంతం చేసుకున్నాడు. ఇంత ప్రజాసేవ చేసినా ప్రజలకు యింకా యెంతో చేయవలసి వున్నదనీ, వాళ్ళ ఆరోగ్యమే తనకు మహాభాగ్యమనీ, అతని నమ్మకం. ఆ నమ్మకంతోనే అతను కాయశక్తులా ప్రజాసేవ చేస్తున్నాడు.

ఇప్పుడు తననింతవాడిని చేసిన సైకిల్ పార్టీ రెండుగా చీలిపోయింది. కేంద్రస్థాయిలో రెండు పార్టీలవారూ, దేశంలో నా బలగం ఎక్కువంటే నా బలగం యెక్కువంటున్నారు. కాని నిజంగా, ఎవరికి ఎక్కువ పలుకుబడి వుందో, రాబోయే ఎన్నికలలో యెవరికి గెలిచే అవకాశముందో, వినాయకానికి అంతుబట్టటంలేదు. ప్లస్ పాయింట్లూ, మైనస్ పాయింట్లూ, కాగితంమీద వ్రాసి ఎన్నో కూడి

“విమలా గౌతమ్”—“సత్యం మందపాటి”

కలూ, తీసివేతలూచేసి (వినాయకం కూడికలూ తీసివేతలూ చేయటం ఏమిటి రైటరూ అని ఆశ్చర్యపోకండి. ఆయన యెంత వేలిముద్రగా డయినా, లెక్కలు చేయటం తెలిసిన చెమ్చా ఒక డున్నాడు ఆయనకి) చివరికి రెండు పార్టీలకూ సమానమైన బలగం వున్నట్టుగా నిర్ణయించుకున్నాడు. అందుకే యింతగా ఆలోచిస్తున్నాడు—సైకిల్ ముందు చక్రం పార్టీలో చేరాలా, వెనక చక్రం పార్టీలో చేరాలా అని. తన బట్టతలమీదవున్న నాలుగున్నర వెంట్రుకలూ పీక్కున్నా, వెంట్రుకలు తెగాయే కాని, ఆలోచన మాత్రం తెగలేదు.

మర్నాడు తన మేడమీద బాల్కనీలో కూర్చుని, తలమీద జుట్టు పీక్కుందామంటే అలాటిదేమీ అక్కడ లేదు కనుక, యేం చేయాలో తోచక, రోడ్డుమీద వచ్చే పోయే జనాన్ని చూస్తూ కూర్చున్నాడు.

చేతిలో పేపరు మాత్రం వుంది. అంటే ఆయన పేపరు చదువుతున్నాడని కాదు—చదవటం రాదు కనుక వూరికే, అలా, హస్తభూషణంలాగా పట్టుకుని కూర్చున్నాడు.

ఇంతలో రోడ్డుమీద జరిగే ఓ సంఘటన ఆయన్ని ఆకర్షించింది. రోజూ స్నేహంగా తిరుగుతూ, ఒకదాని శరీరం యింకోటి నాక్కునే, ఆ రోడ్డుతాలుకు రెండు కుక్కలూ, కాట్ల కుక్కల్లా, అదే రోడ్డుమీద, పెద్దగా అరుస్తూ కొట్టుకుంటున్నాయి. అది చూడగానే ఆయనకు సైకిల్‌పార్టీ గుర్తుకొచ్చింది.

ఈలోగా యీ అరుపులు విని ప్రక్కరోడ్డులోని కుక్క ఒకటి పెద్దగా అరుచుకుంటూ వచ్చింది. రావటం, రావటం, ఈ రెండు కుక్కలమీదా విరుచుకు పడింది. ఈ రెండు కుక్కలూ అనవసరపు అరుపులు మాని, తోక ముడిచి పరుగెత్తాయి. ప్రక్కవీధికుక్క, వాటిని రోడ్డు చివరిదాకా తరిమి, వెనక్కి వచ్చింది. విజయోత్సాహంతో, గర్వంగా, రివీగా అక్కడే తిరుగుతున్నది.

అది చూసి తల ఎత్తిన వినాయకానికి, గోడమీద అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణుడి తైలవర్ణచిత్రం కనపడింది.

బట్టతల పంకించి, లేచి, ధోవతి సర్దుకుని, క్రిందకు వచ్చాడు.

మర్నాడు పేపర్లన్నింటిలోనూ వచ్చింది - వినాయకం సైకిల్‌పార్టీనుంచి రాజీనామా చేసి ఏనుగుపార్టీలో చేరాడని—సైకిల్‌పార్టీ విడిపోవటం తనకేకాక, దేశానికి నచ్చలేదన్నాడు. "కలసి వుంటే కలదు సుఖం" అన్నాడు. "దేశమంటే మనుషులోయ్" అన్నాడు. "మనుషుల్లో దేవుడులాగా వుండాలి రాజకీయ నాయకు"డన్నాడు. యింకా తనకు తెలిసిన నాలుగయిదు తెలుగు సినిమా పేర్లు కలిపి కొన్ని డైలాగులు చెప్పాడు. లక్ష్యం, చిత్తశుద్ధి, వున్నపార్టీ ఏనుగుపార్టీ ఒక్కటే అన్నాడు—తాడిత పీడిత ప్రజానీకానికి రక్షణ నిచ్చేది ఏనుగే, ఏనుగే, అన్నాడు. తన అంతిమక్షణం వరకూ, ప్రజాసేవకే తన జీవితం అంకితమనీ, మానవసేవే మాధవ సేవ అనీ అన్నాడు. ఫోటో కూడా వేయించుకున్నాడు.

వెంటనే రాష్ట్ర రాజధానికి వెళ్ళి, ఏనుగు పార్టీ టిక్కెట్టు సంపాదించుకుని, ఎన్నికలకు తన వూరినించే, ఏనుగుపార్టీ అభ్యర్థిగా నామినేషన్ పడేశాడు.

మొత్తం ఆ వూరినించి నలుగురు అభ్యర్థులు నుంచున్నారు. వినాయకం ఏనుగు పార్టీ టిక్కెట్టుమీద, యింకొకాయన సైకిల్‌ముందు చక్రం పార్టీమీదా, యింకొకాయన సైకిల్ వెనక చక్రం పార్టీమీద, ఇంకో అనామకుడు స్వతంత్ర అభ్యర్థిగా గుర్రంమీదా (సారీ, గుర్రం గుర్తుతో ఇండిపెండెంట్‌గా) నుంచున్నారు. అందరూ ముమ్మరంగా ప్రచారం సాగించారు ఒక్క గుర్రంగారు తప్ప—గుర్రం ఆయన అసలు యిల్లు కదలటం లేదు. హాయిగా యింట్లో గుర్రం ఎక్కి పేకాట ఆడుతూ కూర్చున్నాడు. మిగతావాళ్ళుమాత్రం, నోట్లు చల్లి ఓట్లు పండించటానికి ప్రయత్నం చేస్తున్నారు.

వినాయకం పుగాకు, బియ్యం, నిమ్మకాయలు

మొదలయినవి పండించటంలోనేకాక, ఓట్లను పండించటంలోకూడా చాల అనుభవం కల వాడు—అందుకని అతని పంట మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వచ్చింది. అసలు ఎనిమిది కాయలుగా వచ్చేదేకాని, ముందే రెండు (మందు) కాయలు గుర్రంగారి ఇంటికి పంపించాడు. వాటితోపాటూ కొన్ని విత్తనాలు కూడా పంపించాడు. దాంతో గుర్రంగారు,పంచ కల్యాణి గుర్రమెక్కి, వినాయకంగారికి సపోర్టుగా తను విరమింకుంటున్నానని, సీసాలు బద్దలుకొట్టి మరీ ప్రకటించాడు.

తరువాత కథ తెలుగు సినిమాలా చివరికి సుఖాంతం అవటంతో, వినాయకం, పదివేలు ఓట్ల మెజారిటీతో, మళ్ళీ ఎన్నికయాడు—ఏనుగుపార్టీ, ఏనుగు పార్టియే అన్నాడు—ఏనుగు పార్టీ ఎం.ఎల్.ఏగా తన ప్రజాసేవలో ఏమీ లోపం వుండదన్నాడు.

యిక్కడిదాకా కథ బాగానే వున్నా, యిక్కడే కొంచెం అడ్డం తిరిగే సూచనలు కనపడ్డాయి.

మొత్తం ఆ రాష్ట్రానికి వున్న సీట్లు తొంభయి—గమ్మత్తేమిటంటే ఏనుగుపార్టీ ముప్ఫయి సీట్లూ, సైకిల్ వెనక చక్రం పార్టీ ముప్ఫయిసీట్లూ, ముందుచక్రంపార్టీ ముప్ఫయి సీట్లూ గెల్చుకున్నాయి. అంటే యెవరికీ ఆబ్సెల్యూట్ మెజారిటీ రాలేదు. ఏ పార్టీలోంచయినా పదిహేనుమంది యింకో పార్టీలో చేరితే ఆ పార్టీ ప్రభుత్వాన్ని నిలపగలదు. ఈ నిజాన్ని గుర్తించినవాడై వినాయకం వెన్వెంటనే—చెమ్చాతో సహా రాకెట్ వేగంతో రాజధాని చేరుకున్నాడు.

సరాసరి ఏనుగుపార్టీ ఆఫీసుకి వెళ్ళాడు. వెళ్ళి "హలో" అందామనుకునేలోపలే, ఏదో అనుమానం వచ్చింది. ఎందుకేనా మంచిదని, చెమ్చాని, అక్కడ యెంతమంది వున్నారో లెక్కెయ్యమన్నాడు. ముప్ఫయిమందీ అక్కడికి చేరుకున్నారటకానీ—అప్పుడు అక్కడ పదిమందే వున్నారు—అంటే మిగతా యిరవైమందీ ఏమయినట్టు? వేరే పార్టీలో చేరిపోలేదు కదా?

వినాయకం గుండెలు జారిపోయాయి.

"మనమూ యిక దేంట్లోనో చేరిపోదాం గురూ" అన్నాడు చెమ్చా.

కాని ఎక్కడకు వెళ్ళేట్టు? ఆ యిరవై మంది ముందుచక్రం పార్టీలో చేరారో, వెనక చక్రం పార్టీలో చేరారో తెలీదే? తను ముందు చక్రం ఆఫీసుకు వెడితే, ఈలోగా వెనకచక్రం వాళ్ళు మంత్రివర్గాన్ని ప్రకటిస్తే? తనేం కాను? యిక ప్రజా సేవ యెలా చేసుకునేట్టు?

ఏమైనా కానీ, ఆలోచనకు సమయంలేదు. అంతేకాదు, యెవరినయినా, సలహా అడిగే విషయంకూడా కాదు, ఏదయినా మాట్లాడితే, ముందుగా అవతలివాడు, పరుగెత్తేసి ఆ పార్టీలో చేరిపోయేను.

"జై సాయిబాబా, నువ్వే రక్షించాలి" అనుకుని, వినాయకం, టాక్సీ యెక్కి యెంత వేగంగా పోగలిగితే అంత వేగంగా ముందు చక్రం ఆఫీసుకు ముందు పోనిమ్మన్నాడు—

టాక్సీ ఆగగానే చెమ్చాతో సహా టాక్సీ దిగి, లోపలకు పరుగెత్తాడు. పరుగెత్తుతున్నప్పుడే చెమ్చా అన్నాడు.

"గురూ దారిలో నాకో టాక్సీ కనపడింది. దాంట్లో ముందుచక్రం పార్టీవాళ్ళు పదిమంది వున్నారు—వాళ్ళు—ఏనుగుపార్టీ ఆఫీసుకి వెడుతున్నారులా వుంది!"

ఠక్కున ఆగిపోయాడు వినాయకం.

"సరే అక్కడ పదిమంది వున్నారు—ఈ పదీ కలిస్తే యెంతమంది అవుతారు?" అని అడిగాడు.

చెమ్చా వేళ్లు లెక్కేసి "ఇరవై—అంటే వాళ్ళు మంత్రివర్గం నిర్మాణం చేయలేరుగురూ" అన్నాడు.

వినాయకం మళ్ళీ "జై సాయిబాబా" అనుకుని గబగబా లోపలకు వచ్చాడు.

వినాయకం చెప్పేలోగానే చెమ్చా గబగబా అక్కడ వున్నవాళ్ళను లెక్కపెట్టాడు. "పది మంది గురూజీ" అన్నాడు.

"అంటే యిక్కడినుంచి కూడా కొంత

మంది లేచిపోయారన్న మాట" వినాయకం అరిచాడు.

"ఇక్కడా లాభంలేదు! పదండి గురూ, వెనకచక్రం ఆఫీసుకి" చెమ్చా పరుగెత్తుకుంటూ వెళ్ళి—టాక్సీ తలుపులు తెరిచాడు.

వినాయకానికి చిన్నప్పుడు గేదెలమీదనించి, కాలవలమీద నుంచీ దూకే అలవాటుంది. అది గుర్తుంచుకుని ఒక గెంతు గెంతి టాక్సీలో కూర్చున్నాడు.

టాక్సీ వాయువేగ మనోవేగాలతో వెనక చక్రం ఆఫీసువేపు వెడుతున్నది—

ఎదురుగుండా వస్తున్న టాక్సీని చూసి పెద్దగా అరిచాడు వినాయకం.

ఉలిక్కిపడ్డ చెమ్చా గబగబా టాక్సీలో వాళ్ళను లెక్కేశాడు.

"గురూ—పదిహేనుమంది మొత్తం!"

"డ్రయివర్‌తో కలిపి కాదు కదా" అన్నాడు వినాయకం.

"కాదు గురూ—పదిహేనుమంది వెనక చక్రంవాళ్ళు, ముందుచక్రం పార్టీలో చేరటానికి పోతున్నారు. మొత్తం " చెమ్చా చెప్పటం ఆపి తన చేతివేళ్లూ, కాలివేళ్లూ, వినాయకం కుడిచేతివేళ్లూ అన్నీ లెక్కేసి, "ఇరవయి అయిదు అవుతారు గురూ—వాళ్ళకి లాభం లేదు!" అన్నాడు.

"అయితే యింకా వేగంగా పోనీ"అరిచాడు వినాయకం.

టాక్సీ, రెండు ఊరకుక్కల్నీ, నాలుగు సైకిళ్ళనీ, ఆరు కోడిపుంజుల్నీ తినేసి వెనక చక్రం ఆఫీసుకి ఆఘమేఘాల్లో వచ్చేసింది.

వినాయకం, చెమ్చా ఒకేసారి దూకారు టాక్సీలోంచి—

ఒక లాంగ్ జంపూ, రెండు హైజంపులూ చేసి ఆఫీసులో పడ్డారు.

చెమ్చా గబగబా లెక్కేశాడు, అక్కడి జనాన్ని.

"పదిమంది గురూ" అన్నాడు.

"ఏమిట్రా—నీ లెక్కలు తగలడా! ఎక్కడ పోయినా పదిమంది అంటావు. మిగతావాళ్ళు ఎక్కడ?" కోపం వచ్చింది వినాయకానికి.

చెమ్చా తలనిండా వెంట్రుకలున్నాయి—అందుకని కాసేపు తల గోక్కుని, వెంట్రుకలు పీక్కుని, ఆలోచించాడు.

"అర్థమయింది గురూ—అందరూ మన లాగానే పరుగెత్తుతున్నారన్న మాట తొంభై మందికీ ముప్ఫయిమందే ఆఫీసుల్లో వున్నారు. అంటే మిగతా అరవై మందీ యిలాగే తిరుగు తున్నారన్నమాట—"

"అయితే యిప్పుడేం చేద్దాం—త్వరగా చెప్పు" తొందరపడ్డాడు వినాయకం.

చెమ్చా రక్కున చెప్పాడు. "ఏనుగు ఆఫీసుకే పోదాం గురూ—కానీ వెంటనే పోవాలి మనం" ఈ వాక్యంలోని చివరిభాగం చెప్పేలోగానే, యిద్దరూ టాక్సీ ఎక్కేశారు.

ఈసారి టాక్సీ యెన్ని కోడిపుంజుల్నీ, కుక్కల్నీ తిందో యెవరికీ తెలీదు—ఎందు కంటే లెక్కపెట్టేలోపునే టాక్సీ ఏనుగుపార్టీ ఆఫీసుకి వచ్చేసింది.

అక్కడ టాక్సీ ఆగగానే, చటుక్కున దిగి, యెగిరి గంతేసి, లోపలకు రాబోయిన వినాయ కానికి, మూసివున్న తలుపు రపీమని కొట్టు కుంది. తలుపుకు వేసివున్న తాళానికి గుద్దు కున్నాడు చెమ్చా.

"ఎక్కడకుపోయారు చెప్మా" అన్నాడు వినాయకం.

ప్రక్కనే కూర్చుని తీరిగ్గా అరటి ఆకులో వుప్మా తింటున్న వా చ్ మె న్ చెప్పాడు. "అయ్యా—ఏనుగు పార్టీలోవాళ్ళు యిరవై మంది యిందాకే వెళ్ళి సైకిల్ ముందు చక్రం పార్టీలో చేరిపోయారు. అందుకని వాళ్ళు ముప్ఫయి మందీ, వాళ్ళు యిరవయ్యీ కలిసి మొత్తం "

చెమ్చావేళ్ళు కఙగా లెక్కపెట్టేయటం చూసి, తనలో ఓసారి నవ్వుకుని మళ్ళీ అన్నాడు వాచ్‌మన్.

"—మొత్తం ఏభయిమందీ 'ముందు చక్రంపార్టీ' తరపున మంత్రివర్గం త యా రు చేస్తారట—యిప్పుడే గవర్నర్ బంగళాకేసి వెళ్ళిపోయారు!" చెప్పటం ఆపేసి, జీడిపప్పు వేసిన ఉ ప్మా ని, మళ్ళీ తినటం ప్రారం భించాడు.

హతోస్మి అనబోతున్న వినాయకం తల తిరిగిపోయింది.

చెమ్చా "అరెరె" అని నాలిక కొరుక్కు న్నాడేమో, నాలిక చుర్రుమంది.

"అవును! వీళ్ళందరూ గవర్నర్ బంగళా కేసి వెళ్ళటం నేను చూశాను.పాపం వినాయకం గారు యిప్పుడేం చేయాలి? ఆయన ప్రజాసేవ ఎలా చేసేట్టు? ఆయనకి ప్రస్తుతం ఏమిటి శరణం?" అన్నది,ప్రక్కనేనుంచుని ఇందాకటి నించీ యిదంతా చూస్తున్న గాడిద.

"మరి ఏనుగుపార్టీని గెలిపిద్దామనే వుద్దే శ్యంతో, ఈయనకు ఓట్లువేసిన ప్రజల కేమిటి శరణం?" తింటున్న కాగితాలను, కాసేపు నమలటం ఆపి, అడిగాడు ప్రక్కనే వున్న ఆ గాడిద కొడుకు.

"ఒరేయ్—అలా కాగితాలు తి న వ ద్ద న్నానా. కాగితాలు తింటే నీకు చదురాదు!" కసిరింది తల్లి గాడిద. □

ఫ్రాన్సుదేశపు వార్తాపత్రికలు అమెరికా ప్రభుత్వంమీద కోపం ప్రదర్శిస్తాయి. ఇంగ్లండుదేశపు పత్రికలుకూడా అమెరికా ప్రభుత్వంపై కోపం ప్రదర్శిస్తాయి. జాలి కలిగించే విషయం ఏమిటంటే అమెరికా పత్రికలు కూడ అమెరికా ప్రభుత్వంపై వాటి కోపం ప్రదర్శిస్తాయి.

—శ్రీ శ్రవణ్

ఒకో దేశంవారికి ఒకో అలవాటు. అందమైన అమ్మాయిని పరిచయం చేసి నప్పుడు, ఇంగ్లండు దేశీయుడు ఆమె చేతిని పట్టుకొని కరచాలనంచేస్తాడు. ఫ్రాన్సు దేశస్థుడు చేతిని ముద్దుపెట్టుకుంటాడు. అమెరికావాసి, ఆమెను ఎక్కడైనా వెళదాం రమ్మంటాడు. రష్యా అతను అయితే సలహాకోసం మాస్కో తంతి పంపుతాడు.

—శ్రీ శ్రవణ్